నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మన్సూరాబాద్‌: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం నుంచి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గణాధిపతిపూజ, పుణ్యహవానం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ, రుద్ర హావనం, దుర్గాసూక్తి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9.14 లకు విగ్రహ ప్రతిష్టపన, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

సత్యనారాయణ స్వామి ఆలయం సందర్శన



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవరక్షేత్ర శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని కంచి కామకోటి పీఠం ధర్మాధికారి అరవింద సుబ్రమ్మణ్యం సోమవారం సందర్శించారు. ఈ నెల 18న జరిగే ఆలయ ట్రస్ట్ ఎన్నికల గురించి ఆయనకు తెలిపారు. అలాగే ఈ నెల 25న ఆలయంలో జరిగే 108 వెండి కళశాలతో స్వామి వారికి జరిగే అభిషేకానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వక్కలంక శ్రీనివాసరావు, వసంత మనోహర్, ఎస్ఆర్ శ్రీనివాస్, బచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



మన్సూరాబాద్‌: దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎల్‌బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ, సార్వభౌమత్వ పరిరక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయంగా నిలుస్తాయని తెలిపారు. పాకిస్థాన్ కాల్పుల్లో అమరులైన జవాన్ల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, వంశీవర్ధన్‌రెడ్డి, రమావత్ సక్రునాయక్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వనస్థలిపురం: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం డివిజన్ శక్తినగర్ కాలనీలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, అలివేలు, ఎల్లమ్మ, జయమ్మ, యాదమ్మ, వెంకాయమ్మ, అనిత, నర్సింహా, జగదీష్, అనసూయ, పద్మ, లక్ష్మమ్మ, సులోచన, శోభ, సునీత, నాగమ్మ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35,పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్‌రూ.23,దొండ రూ.35, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.17,గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18,సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడు కాయ రూ.65, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.23, కీర రూ.45, బీన్స్ రూ.125, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.



గడ్డి పొలాల్లో మంటలంటుకుని వెలువడుతున్న దట్టమైన పొగ



ఎగువన ఉన్న గడ్డిపొలాల నుంచి కాలనీలోకి వస్తున్న మురుగు నీరు

మురుగుతో దుర్వాసన..
పొగతో ఉక్కిరిబిక్కిరి!

- గడ్డి పొలాలతో ఇక్కట్లు పడుతున్న కాలనీలవాసులు
- తరచూ మంటలతో వెలువడుతున్న దట్టమైన పొగ
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



శారదానగర్ కాలనీ దిగువన వరద కాలువ నిర్మించాల్సిన స్థలం

వనస్థలిపురం: ఆ కాలనీల సమీపంలో ఉన్న పొలాలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడ్డి పొలాల నుంచి వచ్చే మురుగునీరు, దుర్వాసనతో పాటు తరచూ గడ్డి పొలాల్లో మంటలు చెలరేగుతూ దట్టమైన పొగ వ్యాపిస్తుండడంతో ఊపిరి పీల్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలం వస్తుందంటే ఆ కాలనీవాసులు మరింత ఆందోళన చెందుతుంటారు. ఎగువన ఉన్న కాలనీలు, గడ్డిపొలాల నుంచి వచ్చే మురుగునీటికి తోడు వరదనీరు చేరి కాలనీలను ముంచెత్తుతోంది. ప్రతియేడు ఇదే గోస పడుతున్నా పాలకులు, అధికారులు శాశ్వత నివారణ చర్యలు చేపట్టడం లేదని వనస్థలిపురం శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ కాలనీవాసులు వాపోతున్నారు.

వరద కాలువ లేక..

హయత్‌నగర్ డివిజన్ పరిధిలో 1500 ఇళ్లతో శారదానగర్ కాలనీ ఫేజ్–3 (మోహినీ ఎన్‌క్లేవ్)లో 200లకు పైగా ఇళ్లు ఉంటాయి. అయితే.. కాలనీకి ఎగువన ఉన్న సాహెబ్‌నగర్, పద్మావతి కాలనీ, పీవీఆర్ కాలనీ, సామనగర్, ఆంధ్రకేసరినగర్, కమలానగర్, భూలక్ష్మీనగర్, సుభద్రానగర్ తదితర కాలనీల నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్ ఫేజ్–3 మీదుగానే హయత్‌నగర్ కుమ్మరికుంట, బాతుల చెరువు ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే శాశ్వతవరద కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు, వరదనీరు శారదానగర్‌ను ముంచెత్తుతోంది. వర్షాలు కురిస్తే ఖాళీ స్థలాలు మొత్తం కుంటలుగా మారుతాయి.

నిధులు మంజూరైనా..

శారదానగర్ నుంచి దిగువన ఉన్న నర్సింహారావునగర్ వరకు వరద కాలువ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చినా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వరద కాలువ నిర్మాణం జరిగే దారిలో ఉన్న భూయజమానులు అడ్డుకుంటుండడంతో పనులు ముందుకు సాగడం లేదని వారు ఆరోపిస్తున్నారు. శారదానగర్ సమీపంలో ఉన్న భూమికి సంబంధించిన యజమానులు తమ భూమిలోనుంచి పైప్‌లైన్ వేయడానికి సహకరించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు వారితో చర్చించి వారు కోరుకున్న విధంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) మంజూరు చేయడానికి అంగీకరించినా సదరు వ్యక్తులు సంబంధిత పత్రాలను అందజేయకపోవడంతో పనులు పురోగతి సాధించలేకపోయాయి.

తరచూ మంటలు.. దట్టమైన పొగలు

గడ్డి పొలాల్లో తరచూ చెత్త అంటుకుని మంటలు చెలరేగి దట్టమైన పొగలు కాలనీలో వ్యాపిస్తుంటాయి. ఇటీవల మంటలు చెలరేగడంతో పొగలు వ్యాపించి కాలనీవాసులు ఊపిరి తీసుకోలేని పరిస్థితి నెలకొంది. కాలనీవాసులు ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేసి రప్పించినా పొలాలలో వెళ్లలేక ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి ఇళ్ల చుట్టూ గడ్డి పొలాలు లేకుండా నిషేధించాలని, మురుగునీటితో ఆ గడ్డిని పెంచకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చొరవ తీసుకోవాలి..



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులు కొంత వరకు పూర్తయినా శారదానగర్ దిగువన ఉన్న స్థలంలో సంబంధిత యజమానులు సహకరించకపోవడంతో నిలిచిపోయాయి. పొలాల్లో తరచూ మంటలు అంటుకుని దట్టమైన పొగలు వ్యాపిస్తుండడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వరద కాలువ నిర్మాణం పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– కే.ఎల్.నర్సింహారావు, శారదానగర్, ప్రధాన కార్యదర్శి

బధిర పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో 2025–2026 సంవత్సరానికి గాను సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ఉంటాయన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులు సదరం, ఆధార్, బర్త్ సర్టిఫికెట్, టీసీ, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఉచిత భోజనం, హాస్టల్, బట్టలు ఉచితంగా ఇస్తారని మరిన్న వివరాలకు 7674933347, 900221301 నంబర్లలో సంప్రదించాలన్నారు.



మలక్‌పేటలోని బధిరుల పాఠశాల

◆ ఇటీవల ప్రకటించిన పది ఫలితాల్లో 25 మంది విద్యార్థులకు గానూ 25 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

నేడు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్స్ సెమినార్

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న పాస్టర్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెమినార్ కొనసాగే సెమినార్‌లో జేజీసీఎం వ్యవస్థాపకుడు, ఆర్చ్ బిషప్ ఎం.ఎస్ దయానంద్, యూసీపీడబ్ల్యూఏ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ గోస్ ఫిలిప్, జీఫ్ఎఫ్ఎస్ అధ్యక్షుడు బిషప్ యేసు రత్నం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. అంబర్‌పేట బేతేల్ సెల్ బేస్డ్ చర్చి నిర్వాహకులు బిషప్ ఏ. సుధాకర్ వాక్యోపదేశం, నల్లగొండ పాస్టర్ ఆనంద్ కోట వర్షిప్ చేస్తారని తెలిపారు.

ముగిసిన వీబీఎస్

మలక్‌పేట: అక్బర్‌బాగ్ ఆనంద్‌నగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో వారం రోజుల పాటు వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) ఘనంగా జరిగింది. పిల్లలకు ఫన్ గేమ్స్, బైబిల్ స్టోరీస్, డ్యాన్స్, మ్యూజిక్ నేర్పించి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోస్ హైస్కూల్ కరస్పాండెంట్ క్లార సుశీల గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. పాస్టర్ సుహాస్ బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్‌రత్నరావు, ఆర్.ఏ. జోసెఫ్, క్రైస్తవులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న క్లార సుశీల

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మలక్‌పేట: అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ ఆరోరా కాలేజ్ ఎదురుగా ఉన్న లైన్‌లో సోమవారం ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. నిధుల కొరతతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, అయితే కొంత బడ్జెట్ రిలీజ్ అయిందని డివిజన్‌లో పాడైన రోడ్లలన్నీ బాగు చేస్తామన్నారు. గడ్డిఅన్నారం బస్తీ, కరెంట్ ఆఫీస్‌కు వెళ్లే దారి, వేంకటేశ్వరస్వామి టెంపుల్, మూసారంబాగ్ బస్తీలలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు అంజయ్య, దుర్గాప్రసాద్, దాస్, సంతోష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీ రామాంజనేయ కాలనీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటునామని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం ఏర్పడిన రామాంజనేయ కాలనీలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ సహకారంతో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం సమకూరిందన్నారు. అండర్ డ్రైనేజీ మాత్రం అలానే మిగిలిపోయిందని మురుగుతో దుర్వాసన వస్తోందని వాపోయారు. ఎంపీ నిధుల నుంచి నిధులు మంజూరైన అవి గడువు ముగిసిందని మళ్లీ నూతన ఎస్టిమేషన్ వేసి మళ్లీ ఫండ్స్ రిలీజ్ చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

అ 'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు

నాగోలు: ఎల్‌బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల 2001–2002లో పదో తరగతి చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంటరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లరెడ్డి, జయశ్రీ, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు బండారి మల్లేష్ ముదిరాజ్, గిరి, నాయుడు, నరేష్, కృష్ణ, ఈశ్వర్, అరుణోదయ, కవిత, పార్వతి, పద్మ, దీప్తి పాల్గొన్నారు.

సన్మానం



సౌమ్యశ్రీని సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీబీఐలో సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన మిర్యాలగూడకు చెందిన సౌమ్య శ్రీని సోమవారం నాగోలు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా సౌమ్యశ్రీ సన్మానించి మాట్లాడారు. తెలంగాణలో తొలిసారిగా సీబీఐ అధికారిగా ఎంపిక కావడం యావత్ ఆర్య వైశ్యులకు ఆనందంగా ఉందన్నారు. సౌమ్యశ్రీ మంచి అధికారిగా పేరు తెచ్చుకొని మున్ముందు ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్బా చంద్రశేఖర్, చందా భాగ్యలక్ష్మి, మంజుల నలిని, తులసి, స్వాతి, ప్రవీణ్, రాజు, వర్ధన్, సౌమ్యశ్రీ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మజిల్ స్ట్రోక్‌కు అరుదైన శస్త్రచికిత్స

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ చింతలకుంటలోని నాసా ఆసుపత్రిలో మజిల్ స్ట్రోక్‌కు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరాలజీ క్లినికల్ డైరెక్టర్ డా. నవీన్‌కుమార్ వేణిగళ్ల, క్రిటికల్‌కేర్, అనస్తీషియా విభాగాధిపతి డా. రాకేష్ శస్త్ర వివరాలు వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన పగిళ్ల తిరుపతి (32) ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కుడి పాదం బలహీనం కావడం, నడుంనొప్పి రావడంతో డిస్క్ సమస్య అనుకుని ఎంఆర్ఐ స్కానింగ్ చేసినా సమస్య తెలియకపోవడంతో నాసా ఆసుపత్రికి వచ్చాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం గుండె నుంచి రక్తాన్ని సరఫరా చేసే అయోరా ధమని నుంచి కుడి కాలులోకి రక్తం సరఫరా ఆగిపోయినట్లు గుర్తించారు. పిక్క మొత్తం ఫేషియటమీ చికిత్స ద్వారా మోకాలు నుంచి పిక్క కింది వరకు మజిల్స్ ఓపెన్ చేసి ఎంబోలెక్టమి ద్వారా రక్త నాళాల్లోని గడ్డ కట్టిన రక్తాన్ని తొలగించారు. వేస్కులర్ సర్జన్ నేతృత్వంలో సిటీ యాంజియో చేసి రక్త సరఫరాను పునరుద్ధరించారు. తర్వాత దెబ్బతిన్న కండరాన్ని తొలగించి తొడభాగం నుంచి చర్మాన్ని తీసుకుని ఫ్లాప్ వేసి వ్యాక్యూమ్ అమర్చి స్కిన్ గ్రాఫ్టింగ్ చేశారు. 40 రోజుల తర్వాత తిరుపతి ఇప్పుడు ఆయన కాళ్ల మీద ఆయన నడవగలిగే స్థితిలో ఉన్నాడని వైద్యులు తెలిపారు.



రోగి తిరుపతితో వైద్య బృందం

జైపురికాలనీ పార్క్‌ను అభివృద్ధి చేయాలి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ పార్క్‌ను అభివృద్ధి చేయాలని సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి కోరారు.వర్షం వస్తే పార్కులో మోకాళ్ల లోతు నీళ్లు నిలుస్తాయని గేటు పూర్తిగా విరిగిపోయిందని వాపోయారు. పార్కుకు ప్రహరీతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కోరారు. పార్కులో ఓ బోరు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చిన్న పిల్లలకి ఆడుకోవడానికి ఆట సామగ్రి ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న శ్యామల యాదగిరి



రాగిజావ పంపిణీ చేస్తున్న రామచంద్రరావు

రాగిజావ పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో సోమవారం ఎస్.ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్ర రావు ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెండ్యాల నగేష్, మురళిమనోహర్, పేరాల శేఖర్‌జీ, ఇంద్రసేనరెడ్డి, సరస్వతి, పద్మా, విజయ లక్ష్మి, దివాకర్‌రావు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో

మలక్‌పేట: సుగుణ సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగి అంబలి (జావ)పంపిణీ చేస్తున్నారు. నిర్వాహకులు గడ్డమీది అనిల్‌కుమార్‌గౌడ్ మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం జీపీకే ప్రిమియం హాస్టల్ వద్ద బాటసారులకు రాగి అంబలి అందజేశారు. వేసవిలో ప్రజల దహార్తిని తీర్చిడానికి అంబలి పంపిణీ చేస్తున్నామన్నారు.



అంబలి పంపిణీ చేస్తున్న దృశ్యం

యూ రూల్ ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన యూ రూల్ (ఒక పరిష్కారం) సంస్థ మొదటి కార్యాలయాన్ని సోమవారం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. నిరుద్యోగ యువకులు కలిసి ప్రారంభించిన ఈ సెంటర్‌ను ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోవర్ధన్, దుర్గాప్రసాద్, మహేందర్, వాణినరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దండు మహేందర్, అనిత కూతురు దండు హారిక ఆదివారం విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో 1,222 ర్యాంక్ సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్ సోమవారం శాలువాతో విద్యార్థిని సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థినులను పోత్సహిస్తున్న తల్లిదండ్రులను సైతం అభినందించారు.



యూత్.. గుడ్ థాట్

యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ (కళాశాల బృందం) ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం రైతుబజారు సమీపంలోని హెచ్ఎండీఏ పార్కులో పక్షుల దాహార్తిని తీర్చడానికి మట్టిగిన్నెలు/ నీటి గిన్నెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టి గిన్నెలను పార్కులోని చెట్లకు వేలాడదీశారు. ఇంటి పరిసరాల్లోని చెట్లకు నీటి తొట్టెలను కట్టాలని విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌సాగర్, చరణ్ ప్రసాద్, హర్షిణి, రియా, శరణ్య, కీర్తన, మనీష్, దిశ, ప్రాచి, స్తుతి, ప్రిష, తేజు, అంబదాస్ పాల్గొన్నారు.

– వనస్థలిపురం

